నమస్తే తెలంగాణ

వికారాబాద్

I హైదరాబాద్, గురువారం 26 డిసెంబర్ 2024 VIKARABAD




వికారాబాద్‌లోని చర్చిలో పాస్టర్లు చెప్పే సందేశాన్ని వింటున్న భక్తులు

# దావత్ వితౌట్ దారు

**కొత్త ఏడాది ముగింపు మద్యంతో వద్దు**

**ఫౌండర్ చేగొండి చంద్రశేఖర్**

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : డిసెంబర్ 31 వస్తుందంటే చాలు.. పార్టీలపైనే చర్చ. స్నేహితులు, బంధువులు అందరూ కలిసి వేడుక చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే చాలా వరకు డిసెంబర్ 31 పార్టీని దారుతోనే సెలబ్రేట్ చేస్తుంటారు. అయితే దారు లేకుండా పార్టీ చేసుకోవాలని దావత్ వితౌట్ దారు టీం సభ్యులు సోషల్ మీడియాలో అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి చేసుకునే వేడుక ఎప్పటికీ మంచిది కాదనీ.. మద్యానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ఫౌండర్ చేగొండి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మద్యం లేకుండా పార్టీ చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నదని.. దారు లేకుండా జరిపే పార్టీల ఫొటోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారని వివరించారు. రాబోయే డిసెంబర్ 31 వేడుకల్లో మద్యం సేవించి ఇబ్బందులు ఎదుర్కోవద్దని హితవు పలికారు. కాగా, 'దావత్ వితౌట్ దారు' టీం సభ్యులు దావత్ వితౌట్ దారుపై ప్రజలకు అవగాహన సైతం కల్పిస్తుండటం విశేషం.

# క్రిస్మస్

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైభవంగా వేడుకలు**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. చర్చిలు రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళలాడాయి. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్‌లు ఆకట్టుకున్నాయి. ఏసు, మేరీమాత బొమ్మలను చూడముచ్చటగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆత్మీయ ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. క్రీస్తు గీతాలను ఆలపించారు. బైబిల్ పఠనాన్ని గావించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసు ప్రభువు ప్రపంచానికి అందించిన సందేశాన్ని చదివి వినిపించారు. క్రైస్తవ సోదరసోదరీమణులకు నూతన వస్త్రాలు, క్రిస్మస్ బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

# కాసులొస్తయనుకుంటే.. కన్నీరు మిగిలింది..

**అత్యాశకు పోయి ఆర్‌పీసీ యాప్‌లో**

**రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టిన జనం**

**యాప్ ఎత్తివేతతో లబోదిబోమంటున్న బాధితులు**




ఆర్‌పీసీ యాప్

వికారాబాద్, డిసెంబర్ 25 : అత్యాశకు పోతే.. ఉన్నది పోయినట్లయింది వికారాబాద్ జిల్లాలోని కొంతమంది పరిస్థితి. యాప్‌లో కొంత పెట్టుబడి పెడితే నిత్యం కాసుల వర్షం కురుస్తుందని నిర్వాహకులు ప్రజలను నమ్మించారు. దీంతో పెట్టుబడి పెట్టిన తరువాత ఆ యాప్‌ను పనిచేయకుండా చేశారు ప్రబుద్ధులు. వికారాబాద్ జిల్లాలో ఆర్‌పీసీ యాప్‌లో యువత భారీగా పెట్టుబడి పెట్టారు. ముందుగా యాప్‌ను ఓపెన్ చేయాలంటే ఫోన్ నంబర్ తదితర పాస్‌వర్డ్‌లను ఎంటర్ చేయాలి. ఆ తరువాత ఒక్కొక్క లెవల్‌లో ఒక్కో రకంగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మొదటి లెవల్‌లో రూ.2100 పెట్టుబడి పెడితే రోజుకు రూ.70, రూ.6000 కడితే రూ.200, 18,200 కడితే రూ.650, రూ.56వేలు కడితే రూ.2వేలు, రూ.1.30 లక్షలు కడితే రూ.5వేలు జమ చేస్తామని నిర్వాహకులు ఆశ చూపారు. దీంతో ప్రజలు రూ.లక్షల్లో కట్టినట్లు సమాచారం. ఇప్పటికి 5 లెవల్స్ ఓపెన్ కాగా.. మిగిలిన 4 లెవల్స్‌లో భారీగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. డబ్బులు కట్టిన వ్యక్తులకు రోజూ ఖాతాలో డబ్బులు పడినా, విత్‌డ్రా మాత్రం ప్రతి బుధవారం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గత వారం కట్టిన డబ్బులకు అమౌంట్ బుధవారం విత్‌డ్రా కాకపోవడంతో యాప్ నిర్వాహకులకు ఫోన్ చేశారు. వారిని శాంతపరిచేందుకు హైదరాబాద్‌లో ఒక ఈవెంట్‌ను పెట్టినట్లు సమాచారం వచ్చింది. ఈవెంట్‌కు వచ్చినవారికి నిర్వాహకులు మళ్లీ బుధవారం విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పగా.. వారం రోజులుగా ఆగి విత్‌డ్రా చేసుకుందామని ఎదురు చూసినవారికి నిరాశే మిగిలింది. ఈలోపు నిర్వాహకులు ఆ యాప్‌ను ఎత్తివేశారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు తలలు బాదుకుంటున్నారు. పోలీసులు ఎన్నోసార్లు యాప్‌లలో పెట్టుబడిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజల్లో మార్పు రావడంలేదు.




జమ అయిన డబ్బులను చూపుతున్న యాప్



మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

**కోర్టు ఆదేశాల మేరకు బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి**

**ఘన స్వాగతం పలికిన రైతులు, అభిమానులు, మహిళలు**

**జైలుకు వెళ్లిన అనంతరం మొదటిసారిగా నియోజకవర్గానికి రాక**

# వీర తిలకం దిద్ది.. మంగళహారతులిచ్చి..

*లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన అనంతరం మొదటి సారిగా నియోజకవర్గానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. కోర్టు ఆదేశాల ప్రకారం బుధవారం మాజీ ఎమ్మెల్యే బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా అభిమానులు, రైతులు మాజీ ఎమ్మెల్యేకు వీర తిలకం దిద్ది, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమాన్ని కోరుకునే నాయకుడిని జైల్లో పెట్టారని కన్నీటిపర్యంతమయ్యారు. న్యాయం ఎప్పటికీ గెలుస్తుందని, రైతుల పక్షాన పోరాడిన మాజీ ఎమ్మెల్యే వెంటే ఉంటామని జనం జేజేలు పలికారు. రాజకీయ కక్షతో కేసులో ఇరికించారని ఇలాంటి నాయకుడిని దూరం చేసుకోబోమన్నారు. గతంలో బీఆర్‌ఎస్ పాలనలో ఎటువంటి కష్టం లేకుండా వ్యవసాయం చేసుకున్నామని రైతులు తెలిపారు. కానీ కాంగ్రెస్ పాలనలో సంవత్సర కాలంలోనే రైతులే కాకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు.*

*- కొడంగల్, డిసెంబర్ 25*

## లగచర్ల దాడికి కారణం.. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే..

లగచర్ల దాడికి కారణం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం, పోలీసులు, నిఘా వైఫల్యమేనని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని రేవంత్‌రెడ్డి సర్కార్ చూస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలంటూ కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్ సర్కార్ తూతూమంత్రంగా రైతుల రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకపోతే సీఎం పదవి నుంచి తప్పుకోవాలన్నారు. ఎకరానికి రూ.15వేల రైతుభరోసా ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అమలు చేయడంలో విస్మరించిందన్నారు. పింఛన్లు పెంచుతామని, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామన్న హామీ ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. రూ.500లకే సిలిండర్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్... ఎక్కడిస్తున్నారో చెప్పాలన్నారు. రేవంత్ సర్కార్ తీరును ప్రజలు, రైతులు గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

**అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని చూస్తుండ్రు**

**మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది**

**తూతూమంత్రంగా రుణమాఫీ..**

**పింఛన్ల పెంపు ఎక్కడా.. కల్యాణలక్ష్మి తులం బంగారమెక్కడ ?..**

**మహిళలకు రూ.500లకే గ్యాస్ ఎక్కడిస్తున్నారో చెప్పాలి..**

**కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**



బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే

# ఆదాయం ఫుల్.. వసతులు నిల్..

**రంగారెడ్డి జిల్లాలో 18 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు.. ఏండ్ల తరబడిగా అద్దె భవనాల్లోనే ఆఫీసులు**

**ప్రతినెలా రూ.300 కోట్ల వరకు సమకూరుతున్న ఆదాయం.. కనీస వసతుల కల్పనలో ప్రభుత్వ నిర్లక్ష్యం**

**కూర్చునేందుకు బెంచీలు, తాగునీరు, మూత్రశాలలు కరువు.. ఇబ్బందుల్లో ప్రజలు**



అద్దె భవనంలో కొనసాగుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం..



ఒకే భవనంలో ఫరూఖ్‌నగర్- షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

*ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తీసుకొచ్చే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సమస్యలతో సహవాసం చేస్తున్నాయి. ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉండగా.. వసతుల కల్పనలో మాత్రం అధమస్థానంలో ఉన్నాయి. జిల్లాలో 18 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలుండగా ఏండ్ల తరబడిగా వాటికి సొంత భవనాల్లేక.. అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ ఆఫీసుల్లో కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు లేక, తాగేందుకు నీరు, మూత్రశాలల్లేక ఇక్కడికి ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 18 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలుండగా వాటి ద్వారా ప్రభుత్వానికి ప్రతి నెలా దాదాపుగా రూ. 300 కోట్ల వరకు ఆదాయం సమకూరుతున్నట్లు సమాచారం.*

*-రంగారెడ్డి, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)*

## చాలీచాలని వసతులతో..

జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో గత 30 ఏండ్లుగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అద్దె భవనంలోనే ఉన్నది. అలాగే, షాద్‌నగర్‌లో ఒకే అద్దె భవనంలో షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్‌లకు చెందిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, హయత్‌నగర్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, చేవెళ్ల వంటి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కూడా కొన్నేండ్లుగా అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వాటికి పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు న్నాయి. జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ చాలీచాలని వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కాగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పక్కా భవనాల కోసం గత ప్రభుత్వం రూ. కోటి నిధులు కేటాయించింది. ఇబ్రహీంపట్నంలో భవన నిర్మాణ పనులను ప్రారంభించినా ప్రభుత్వం మారడంతో ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ భవన నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం స్పందించి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ పక్కా భవన నిర్మాణ పనులు

**ప్రతినెలా రూ.300 కోట్ల వరకు ఆదాయం..**

జిల్లాలో 18 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. అవి.. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, పెద్దఅంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, హయత్‌నగర్, చంపాపేట, శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, ఫరూఖ్‌నగర్ వంటి ప్రాంతాల నుంచి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రతినెలా రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరుతున్నది. కానీ, ఈ కార్యాలయాలకు వచ్చే వారికి కూర్చునేందుకు కూడా వసతుల్లేక.. తాగేందుకు నీళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.